క్లుప్తంగా

వేగేశ్వరపురంలో అన్న సమారాధన

తాళ్లపూడి: హనుమద్రత్న ఉత్సవాలు ముగిసిన సందర్భంగా వేగేశ్వరపురంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం సుమారు నాలుగు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

ఆంజనేయస్వామి కల్యాణం

దేవరపల్లి: సువర్చలా సమేత అభయాంజనేయస్వామి వారి దివ్య కల్యాణాన్ని మంగళవారం స్థానిక గోపాలపురం రోడ్డులోని అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కల్యాణం నిర్వహించారు. ఏలూరు జిల్లా రావికంపాడుకు చెందిన వేద పండితుడు స్వామి వారి కల్యాణం జరిపించారు.

చాగల్లు: హనుమత్ వ్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం చాగల్లు భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు శివసీతారామశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి తులసీ దళార్చన, నాగవల్లీ పత్రపూజ, బిల్వ దళార్చన, అర్కపుష్ప పూజ నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు దేవాలయానికి వచ్చి పూజలను చేసి స్వామిని దర్శించుకున్నారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

చాగల్లు: ఊనగట్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 18, 19 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. 33/ 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఊనగట్ల, నందిగంపాడు, ఎస్. ముప్పవరం, కుంకుడుమిల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తి అరెస్ట్

గోపాలపురం: ఒకరిని కులం పేరుతో దూషించడమే గాకుండా హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి కొవ్వూరు కోర్టుకు తరలించినట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. భీమోలుకు చెందిన పెనుమక మోషే అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కోడి అనిల్ కుమార్ కులం పేరుతో దూషించడమే కాకుండా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడు మోషే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అనిల్ కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై కొనసాగుతున్న శిక్షణ

కొవ్వూరు: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం డివిజన్‌లోని పలు మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొవ్వూరు మండలంలో దొమ్మేరు, కాపవరం, ఐ.పంగిడి, నందమూరు, పశివేదల గ్రామాల వారికి ఈ శిక్షణ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన తొమ్మిది అంశాల గురించి వివరించారు. ఎంపీడీవో కె.సుశీల, ఈవోపీఆర్ అండ్ ఆర్డీ ఉమామహేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే

చాగల్లు: పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో రెండో బ్యాచ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, డీపీఆర్‌సీ ఏలూరులో శిక్షణ పొందిన ఏపీఎం ఈ.శ్రీనివాస్, ఎంపీహెచ్‌వో శాస్త్రి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానికీకరణ, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు.

ఉండ్రాజవరం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చా రు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, ఎంపీడీవో వి.రామారావు ఆధ్వర్యంలో శిక్షణ సాగింది. డీపీఆర్‌సీ సిబ్బంది ప్రసంగి రాజు, చక్రపాణి పలు అంశాలు వివరించారు.

వసతి గృహంలో సమస్యల తిష్ట

- కూలడానికి సిద్ధంగా భవనం
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- ముళ్లపొదలతో నిండి ఉన్న ప్రాంగణం



గౌరీపట్నంలో శిథిలావస్థకు చేరుకున్న బాలుర వసతిగృహం



వసతిగృహంలోని మరుగుదొడ్ల దుస్థితి

దేవరపల్లి: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఈ వసతి గృహాల్లో కనీస వసతి సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూ వస్తోంది. శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలు, ముళ్లపొదలతో నిండి ఉన్న ప్రాంగణాలతో వసతిగృహాల్లో విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ నివసిస్తున్నారు. కనీస మరమ్మతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తమ గోడును పట్టించుకున్న నాథుడు లేడని వారు వాపోతున్నారు. కిటికీలకు తలుపులు లేక చలిగాలికి విద్యార్థులు రాత్రిపూట గజగజ వణుకుతున్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు పెచ్చులు ఊడి, గోడలు బీటలు తీసి కూలడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు భవనం కూలిపోతుందోనని విద్యార్థులు భయంతో బిక్కుబిక్కుమంటు ఉంటున్నారు. 1994–95లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ వసతి గృహాన్ని నిర్మించారు. సుమారు ఎకరం స్థలంలో భవనాన్ని నిర్మించారు. వసతిగృహం చుట్టూ గార్డెన్, నీడనిచ్చే చెట్లు ఏర్పాటు చేశారు. వసతిగృహం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు పోటీ పడి మరీ ఈ వసతిగృహంలో చేరేవారు. బాలుర ప్రత్యేక వసతిగృహంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో దాదాపు 150 నుంచి 200 మంది విద్యార్థులు ఈ హాస్టల్లో ఉండి చదువుకొనే వారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడ ఆశ్రయం పొందే వారు. రానురానూ హాస్టళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ తగ్గడంతో వసతిగృహంలో విద్యార్థుల సంఖ్య పడిపోయింది. ఒక దశలో వసతి గృహాన్ని మూసివేయడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం వసతి గృహంలో 27 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు.

మరమ్మతులకు నోచుకోని భవనం

శిథిలావస్థకు చేరుకున్న భవనం మరమ్మతులకు నోచుకోలేదు. భవనం దుస్థితి పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిటికీల తలుపులు ఊడిపోయి వేలాడుతున్నాయి. భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కనీసం గోడలకు పెయింటింగ్ కూడా వేయకపోవడంతో గోడలు దుమ్ము, మరకలతో ఉన్నాయి.

తలుపులు లేని మరుగుదొడ్లు

మరుగుదొడ్ల తలుపు ఊడిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బయటకు వెళ్లి విద్యార్థులు బహిరంగ మల విసర్జన చేస్తున్నారు. మరమ్మతులు చేయకపోవడంతో మరుగు దొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వంట గది శిథిలమై ఉంది. భవనం పరిసరాలు ముళ్లపొదలు, తుప్పలతో నిండి ఉండడంతో పాములు తిరుగుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వసతి గృహానికి శాశ్వత మరమ్మతులు చేసి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు



సాంఘిక సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు వసతిగృహాన్ని పరిశీలించి వెళ్లారు. మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. నిధులు మంజూరు కావలసి ఉన్నాయి. పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. 27 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తభవనం నిర్మించాల్సి ఉంది. మరుగుదొడ్లు మరమ్మతులు చేస్తాం.

– ఆర్‌వీ శ్రీనివాసరావు, ఏఎస్‌డబ్ల్యూఓ, దేవరపల్లి

భీమోలు వివాదాస్పద భూముల పరిశీలన



భీమోలు వివాదాస్పద భూములపై వచ్చిన ఫిర్యాదులపై చర్చలు జరుపుతున్న జేసీ చిన్న రాముడు

గోపాలపురం: భీమోలు గ్రామంలోని వివాదాస్పద భూములపై భూ యజమానులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఈ గ్రామంలోని వివాదాస్పద భూములను జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు మంగళారం పరిశీలించారు. అనంతరం భూమి యజమానులు, నోటీసులు ఇచ్చిన పట్టాదారులు, కౌలుదారులతో జేసీ చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ కె.అజయ్‌బాబు విచారణ జరిపారు. దాదాపు 130 ఎకరాలకు తాము హక్కుదారులం అంటూ భూ యజమానులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు జేసీ వివరించారు. భూ యజమానులు, కౌలు దారులు, పట్టాదారులకు సంబంధించిన పత్రాలను పరిశీలించామన్నారు. వాటి పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తామని జేసీ తెలిపారు.

రైతుల ఫిర్యాదుల పరిష్కారానికే సదస్సులు

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
- పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



పెరవలి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత



రావిమెట్ల రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న నిడదవోలు తహసీల్దార్ నాగరాజు నాయక్

పెరవలి: రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. పెరవలిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతుల నుంచి 22 అర్జీలు అందాయి. కార్యక్రమంలో తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, ఆర్ఐ పావని, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో రాణి సుస్మిత పెరవలి నెం.1 పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, ఆర్ఐ పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లి: యాదవోలు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ సున్నం వరప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హాజరైన దేవరపల్లి తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి రైతులు, ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సదస్సులో 11 అర్జీలు రాగా వాటిలో ఆర్ఓఆర్ ఫిర్యాదులు 7, భూముల రీ సర్వే కోసం నాలుగు ఫిర్యాదులు వచ్చినట్టు తహసీల్దార్ వివరించారు. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రైతులు, గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఈ సమావేశంలో దేవదాయ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. సదస్సుకు ఆరు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ తెలిపారు. సదస్సులో మండల సర్వేయర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి, విఆర్వోలు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నిడదవోలు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. రావిమెట్లలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామస్తుల నుంచి 16 అర్జీలు వచ్చాయి. పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతులు అందించారు. సదస్సులో గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగన సూర్యారావు, డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్, ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వో బస్వా సర్వేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: మండలంలోని చిడిపి గ్రామంలో తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 11 దరఖాస్తులు అందాయి. వాటిలో రెండు భూ సర్వేకు సంబంధించి, తొమ్మిది వన్- బీ, అడంగల్ అవసరమని ఫిర్యాదులందాయన్నారు.తొమ్మిది దరఖాస్తులు పరిష్కారం అయినట్టు తెలిపారు.సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నడిపల్లి అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



నిడదవోలులో సీనియర్ పింఛనర్లకు సన్మానం

నిడదవోలు: జాతీయ పింఛనర్ల దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్‌బీఐ అధికారి మీనాక్షి తన ప్రసంగంలో పెన్షనర్లకు, సీనియర్ సిటిజన్లకు ఎస్‌బీఐ అందిస్తున్న సేవలను వివరించారు. పింఛనర్లకు ఎస్‌బీఐ జీఎం లాల్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పింఛనర్ల సంఘం నిడదవోలు శాఖ అధ్యక్షుడు బలగం అప్పారావు అధ్యక్షతన 70 ఏళ్లు నిండిన సీనియర్ పింఛనర్లు శమంతకమణి, ఖండవిల్లి రంగాచార్యులు, ఎస్.కృష్ణమాచార్యులు, బి.నాగేశ్వరరావులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, కోశాధికారి ఎలిపిన శేషగిరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లి: పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక మండల రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల ఆరాధ్యుడు డీఎస్ నకారా చిత్రపటానికి రిటైర్డ్ ఉద్యోగులు పూలమాల వేసి నివాళి అర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులు వెలిచర్ల మూర్తి, సింహాద్రి నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు. మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పప్పు వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కేశిరాజు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి ఈడ్పుగంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పెన్షన్ అనేది భిక్ష కాదు ఉద్యోగుల హక్కు అని జిల్లా సీపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.

చాగల్లు: పెన్షనర్ల హక్కుల సాధకులైన డీఎస్ నకారా, వైవీ చంద్రాచూడ్‌లకు చాగల్లులోని అంబేడ్కర్ రీడింగ్ భవనంలో ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ మండల కార్యదర్శి కేఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. తొలుత సంఘం అధ్యక్షులు కోడి నాగేశ్వరరావు పంపిన వీడియో సందేశాన్ని సభ్యులకు వినిపించారు.

పెరవలి డీసీ చైర్మన్‌గా బూరుగుపల్లి



పెరవలి డీసీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాస్‌కు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

పెరవలి: పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) చైర్మన్‌గా వేలివెన్ను సాగునీటి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా టి.వేమవరం సాగునీటి సంఘం అధ్యక్షుడు నల్లా భాస్కర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది. వారిద్దరికీ కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, ఇరిగేషన్ ఏఈ ఎస్.బాలమురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పాడి రైతుకు అండగా
కృష్ణా మిల్క్ యూనియన్



పాడి రైతులకు బోనస్ అందజేస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

నల్లజర్ల: పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాడి రైతులకు ఈఏడాది తొలివిడత నాలుగు నెలలకు రూ.2.16 కోట్లు, రెండో విడతగా రూ.2.18 కోట్లు మొత్తం రూ.4.34 కోట్ల బోనస్ పంపిణీని మంగళవారం నల్లజర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పాడి పరిశ్రమను కేవలం వ్యాపార పరంగానే చూడబోమన్నారు. రైతుల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటున్నామని చెప్పారు. వారి సంక్షేమం కోసం ఇన్సూరెన్స్, సెమన్ పంపిణీ, సంచార వైద్యశాలలు, దాణా సరఫరా, పెళ్లికానుక, మృతి చెందిన రైతుల కుటుంబాలకు పరిహారం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు వివరించారు. ఈ ఏడాది సంక్షేమ కార్యక్రమాలకు రూ.7.50 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. దేశంలో పాల ధర లీటర్‌కు రూ.82 గా ఉన్నప్పటికీ, పాడి రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో కలుపుకుంటే లీటర్ పాల ధర రూ.92 కు చేరుతుందన్నారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఏజీఎం అన్వేష్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఘంటా నాగేశ్వరరావు, రాళ్ళగుంట, నల్లజర్ల మేనేజరు మూర్తి, పాలసంఘ అధ్యక్షుడు నందమూరి రామకృష్ణ, యలమాటి ఆనంద్,అల్లూరి దుర్గారావు, పెండ్యాల వీరరాఘవులు, మద్దిపాటి వీరరాఘవులు, రైతులు పాల్గొన్నారు.

క్రైస్తవం అంటేనే కృతజ్ఞతకు చిహ్నం

- వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ జాన్‌వెస్లీ
- ప్రకాశరావుపాలెంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రకాశరావుపాలెంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ

నల్లజర్ల: క్రీస్తు మాదిరిగా ప్రతి ఒక్కరూ ప్రేమ,శాంతి, సమాధానం కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. ప్రకాశరావుపాలెం లూథరన్ చర్చిలో ఫాదర్ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవం అంటేనే కృతజ్ఞతకు చిహ్నమని, ప్రతి క్రైస్తవుడూ మంచి మనసు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కండవల్లి రాబిన్‌పాల్, ఏఈఎల్‌సీ బిషప్ అక్కాబత్తుల శామ్యూల్‌రాజు, పాస్టర్ కర్నేల్, అవినాష్, విజయరాజు, రామ్మోహన్, సందీప్ రమేష్, ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అతిథులను సత్కరించారు.

గోపాలపురం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండలంలోని సాగిపాడు లెప్రసీ కాలనీ వాసులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ హాజరయ్యారు. కేజీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రాబిన్ సేవలను వెస్లీ కొనియాడారు. కార్యక్రమంలో పలివెల జక్రయ్య, మాణిక్యాలరావు, రూపస్ కుమార్, రామ్మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'లయన్స్'ఆధ్వర్యంలో చర్మవ్యాధుల వైద్య శిబిరం

కొవ్వూరు: సేవా దృక్పథంతో లయన్స్ క్లబ్ ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మంటపంలో మంగళవారం ఉచిత చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఏలూరుకు చెందిన విజయ చర్మవ్యాధుల ఆసుపత్రి వైద్యుడు, గోల్డ్ మెడలిస్ట్ డి.సుబ్బారావు రోగులకు వైద్య సేవలందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు సుబ్బారావును ఎమ్మెల్యే, లయన్స్‌క్లబ్ సభ్యులు సత్కరించారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కూటమి నేతల మోకాలడ్డు!

- 15 రోజులుగా పని చేయని అన్నవరప్పాడు ఆర్వో ప్లాంట్
- మూడు గ్రామాలకు తాగునీటి ఎద్దడి
- వర్క్ ఆర్డర్ ఇచ్చినా జరగని మరమ్మతులు
- కూటమి నేతలు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు
- పంచాయతీ తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపుతామంటున్న సర్పంచ్



అన్నవరప్పాడులో మూతపడిన ఆర్వో ప్లాంట్

పెరవలి: నిధులు మంజూరై మూడు నెలలైనా కూటమి నాయకులు మోకాలు అడ్డడంతో పక్షం రోజులుగా మంచినీళ్లు లేక ప్రజలు అల్లాడితున్నారు. 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అన్నవరప్పాడు పంచాయతీకి చెందిన ఆర్వో ప్లాంట్ పాడైపోయింది. సర్పంచ్ పంతం బాలసుందరి విజ్ఞప్తి మేరకు ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు మూడు నెలల క్రితం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మండల పరిషత్ నిధులు రూ.2.20 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ పనికి వర్క్ ఆర్డర్ ఇచ్చి నెల అవుతున్నా మండల, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు చేపట్టలేదు. కాగా 15 రోజుల క్రితం ఈ ఆర్వో ప్లాంట్ పూర్తిగా మూత పడింది. దీంతో అన్నవరప్పాడుతో పాటు పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాల ప్రజలు తాగునీటి తీవ్ర ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

మంత్రితో చెప్పి నిలుపుదల చేయిస్తాం

అధికారులు ఈ పని చేయక పోవడానికి వారికి కూటమి నాయకుల నుంచి వచ్చిన బెదిరింపులే కారణమని అన్నవరప్పాడు వాసులు ఆరోపిస్తున్నారు. తమను కాదని అధికారులు ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేపడితే మంత్రితో చెప్పి నిలుపు చేయిస్తామని కూటమి నాయకులు హెచ్చరించినట్టు తెలిసింది. ఈ పని విషయమై అడిగితే 'స్థానిక నాయకులు ఇబ్బంది పెడుతున్నారు. మీరూ మీరూ చూసుకోండి. అన్నీ సద్దుమణిగాక అప్పుడే పనులు చేస్తాను' అని కాంట్రాక్టర్ చెప్పారని సర్పంచ్ పంతం బాలసుందరి తెలిపారు. కూటమి నాయకులు ఎంపీపీని కలసి, తాము చెప్పినట్టు చేయకపోతే కుదరదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడతారని ఎంపీపీ చెప్పినా వారు వినలేదని తెలిసింది. మంచి నీళ్ల కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చెప్పినా పట్టించుకోనందున పంచాయతీ తీర్మానం చేసి, నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు.

మా ఇబ్బందులు మాకున్నాయి



పనులు చేయమని కాంట్రాక్టర్‌కు చెప్పాను. త్వరలోనే చేపడతాం. మాకుండే ఇబ్బందులు మాకున్నాయి. ప్లాంట్ బాగుచేయాలంటే తాళం ఉండాలి కదా.

– సీహెచ్ వెంకటరమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ, పెరవలి

అధికారులు పట్టించుకోవడం లేదు



మంచినీటి సరఫరా ఆగిపోయి 15 రోజులైంది. ఎన్నిసార్లు పంచాయతీ అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. ఖండవల్లి వెళ్లి మంచి నీళ్లు తెచ్చుకోవలసి వస్తోంది. సర్పంచ్‌ను అడిగితే పనులు చేయనీయడం లేదని చెబుతున్నారు.

–గిద్దా ఏడుకొండలు, అన్నవరప్పాడు

తాగునీటి కోసం పాట్లు



పదిహేనేళ్లుగా ఈ నీళ్లనే తాగుతున్నాం. ఎప్పుడు ఇలాంటి పరిస్థితి చూడలేదు. తాగునీటి కోసం ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవటం లేదు.

– పులపర్తి కిషోర్, అన్నవరప్పాడు

నేడు కొవ్వూరు మండల సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్టు చెప్పారు. అన్ని శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.